క్లుప్తంగా

చదువుపై దృష్టి సారించండి..



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

టేకులపల్లి: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఇంటర్ విద్య జిల్లా అధికారి (డీఐఈఓ) వెంకటేశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ స్థాయి వయస్సు ఎంతో సున్నితమైందని, క్రమశిక్షణతో లక్ష్య సాధన కోసం పాటుపడాలని తెలిపారు. ప్రిన్సిపాల్ బి.సులోచనరాణి, రామలింగేశ్వరరావు, కల్పన, శంకర్ పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరచారి

పాల్వంచ: పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి అన్నారు. బుధవారం పట్టణంలోని కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పనితీరును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన విధానాన్ని, పాఠ్యాంశాల బోధన, ఉత్తీర్ణత వివరాలను ప్రధానోపాధ్యాయులు ఎస్.మాధవరావును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా న్యాస్ జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందించారు.

గిరిజనుల ఆందోళన



ఆందోళన చేస్తున్న గిరిజన సొసైటీ సభ్యులు

పాల్వంచ: కేటీపీఎస్ బూడిద తరలింపుపై యాజమాన్యం అగ్రిమెంట్ చేయకపోవడంపై గిరిజన సొసైటీ సభ్యులు ఆందోళన బాట పట్టారు. బుధవారం కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేశారు. అనంతరం అక్కడే రోడ్డు పక్కన టెంట్ వేసి బైఠాయించారు. బూడిద లారీలను అడ్డుకున్నారు. పలు పార్టీలకు చెందిన నేతలు వారికి మద్దతు పలికారు. మాట్లాడుతూ... ఐటీడీఏ అధికారులు గిరిజన సొసైటీలకు జెన్‌కో యాజమాన్యం బూడిద తరలింపుకు ఇటీవల ఒప్పుకున్నారని, దీంతో తాము డీడీలు కట్టి వారంరోజులు అవుతున్నా అగ్రిమెంట్ చేయడం లేదని ఆరోపించారు. దొడ్డా రవికుమార్, ముత్యాల విశ్వనాథం, వడ్లమూడి పూర్ణచందర్‌రావు, చందర్‌రావు, మురళీ, సుమన్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

పాల్వంచరూరల్: రైతులు పశువులు, పెరటి కోళ్ల పెంపకంలో యాజమాన్య పద్ధతులు పాటించాలని పశువైద్య కళాశాల వైద్యులు సూచించారు. పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, జిల్లా పశువైద్యశాఖ, సహకారంతో జాతీయ సేవా పథకములో భాగంగా ఏడు రోజులపాటు ఈనెల 1నుంచి 7వ తేదీ వరకు ప్రత్యేక పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. బుధవారం సోములగూడెం, పునుకుల గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 2,150 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పశువైద్య కళాశాల బృందం డాక్టర్లు, 36మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

యాజమాన్యం నిర్లక్ష్యంతోనే ప్రమాదం


మాట్లాడుతున్న సీతారామయ్య

టేకులపల్లి: సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే హెడ్ ఓవర్ మెన్ మృతి చెందాడని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం (జీఎల్‌బీకేఎస్) ప్రధాన కార్యదర్శి జే.సీతారామయ్య, రాష్ట్ర నాయకుడు ఎండీ రాసుద్దీన్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం టేకులపల్లిలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ముందుగా సత్యనారాయణకు సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మాట్లాడుతూ... జీడీపీ7 ఎల్ఈపీలో జరిగిన ప్రమాదానికి పూర్తి బాధ్యత సింగరేణి యాజమాన్యమే వహించాలని డిమాండ్ చేశారు. ప్రమాదానికి కారకులైన అధికారులపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. మృతుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో సింగరేణిలో ప్రమాదాలు జరగకుండా కార్మికులు అధికారుల ప్రాణాలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

నిలిచిన దంత వైద్యసేవలు

- పీహెచ్‌సీలో మూతపడిన డెంటల్ యూనిట్
- నిరుపయోగంగా యంత్ర పరికరాలు


జూలూరుపాడు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో దంత వైద్యసేవలు నిలిచిపోయాయి. డెంటల్ డాక్టర్ లేకపోవడంతో యూనిట్ మూతపడింది. గతంలో 2020–2022 వరకు కరోనా కారణంగా మూడేళ్లపాటు దీనిని మూసివేశారు. ఆ తరువాత జనవరి 2023లో ఇల్లెందు నుంచి డిప్యూటేషన్‌పై డెంటల్ డాక్టర్ రావడంతో 10 నెలలు పాటు దంత వైద్యసేవలు సజావుగానే జరిగాయి. కానీ వచ్చిన డాక్టర్ తిరిగి ఇల్లెందు వెళ్లడంతో మళ్లీ సమస్య మొదటికి వచ్చింది. జూలూరుపాడు డెంటల్ యూనిట్ రెగ్యులర్ డాక్టర్ పోటు వినోద్ డిప్యూటేషన్‌పై వెళ్లి తిరిగి రావడంతో దంత సేవలు యథాతథంగా కొనసాగాయి. జూలై 2024లో డెంటల్ డాక్టర్ వినోద్ బదిలీపై రంగారెడ్డి జిల్లా మల్కాజ్‌గిరి పీహెచ్‌సీకి వెళ్లారు. ఈ స్థానంలో బూర్గంపాడు పీహెచ్‌సీలో విధులు నిర్వర్తించే డెంటల్ డాక్టర్ అనిత జూలూరుపాడుకు వచ్చిన తరువాత నెల రోజులకే డిప్యూటేషన్‌పై బూర్గంపాడు తిరిగి వెళ్లడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. నాలుగు నెలలుగా డెంటల్ డాక్టర్ లేకపోవడంతో దంత వైద్యసేవలు నిలిచిపోయాయి. రూ.లక్షల విలువైన యంత్రపరికరాలు నిరుపయోగంగా మారాయి.

అంతేకాకుండా వైద్యసేవలు అందకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రెగ్యులర్ డెంటల్ డాక్టర్ డిప్యూటేషన్‌పై వెళ్లినప్పటికీ జీతభత్యాలు మాత్రం ఇక్కడి నుంచే పొందుతున్నారు. గత నవంబర్ 7న స్థానిక పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్ డెంటల్ డాక్టర్‌ను నియమిస్తామని చెప్పారు కానీ, అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చకపోవడంతో ప్రజలకు దంత సేవలు అందని ద్రాక్షగానే మిగిలింది. ప్రస్తుతం పీహెచ్‌సీని సీహెచ్‌సీ భవనంలోనే నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయడంలో భాగంగా 2016–2017లో దంత వైద్యుడితోపాటు, మరో నలుగురు మెడికల్ ఆఫీసర్లు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఒక హెడ్ నర్సును ప్రభుత్వం నియమించింది. ఆనాటి నుంచి సీహెచ్‌సీగా కొనసాగుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో అప్‌గ్రేడ్ చేయకపోవడంతో పీహెచ్‌సీ స్థాయి ప్రజలకు వైద్యసేవలు అందుతున్నాయి. ఇదే భవనంలో ఒక గదిని కేటాయించి సుమారు రూ.10 లక్షలు ఖర్చు చేసి సెప్టెంబర్ 2019లో డెంటల్ యూనిట్‌ను ప్రారంభించారు. రూ.7.50 లక్షలు విలువ చేసే అత్యాధునిక డెంటల్ మిషన్, చైర్, ఇతర పరికరాలు తీసుకొచ్చారు. డెంటల్ డాక్టర్ వినోద్ పని చేసిన సమయంలో ఎన్నో అరుదైన శస్త్ర చికిత్సలు, దంత సంబంధిత వ్యాధులకు వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలను పొందారు. ఆనాటి కలెక్టర్ రజత్‌కుమార్‌శైనీ జూలూరుపాడు పీహెచ్‌సీలో డెంటల్ యూనిట్ ఏర్పాటు చేయాలని


నిరుపయోగంగా చికిత్స పరికరాలు

దంత వైద్యుడు వినోద్ విజ్ఞప్తి మేరకు అందుకు కావల్సిన నిధులు మంజూరు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ఏ ప్రభుత్వాస్పత్రిలో లేని డెంటల్ మిషన్ జూలూరుపాడు పీహెచ్‌సీ డెంటల్ యూనిట్‌లో నెలకొల్పడంతో ప్రజలు సంతోషించారు. ప్రస్తుతం డెంటల్ డాక్టర్ లేకపోవడంతో ప్రజలకు దంత వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డెంటల్ యూనిట్ ఉన్నప్పటికీ దంతవైద్యులు అందుబాటులో లేకపోవడంతో స్థానికులు పెదవి విరుస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

డాక్టర్‌ను నియమించాలి...


డెంటల్ యూనిట్‌లో డాక్టర్‌ను నియమిస్తే దంత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. డాక్టర్ లేకపోవడంతో దంత సంబంధిత రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– రేగళ్ల నర్సయ్య, వినోభానగర్

ప్రైవేటుకు వెళ్తే ఖర్చు..


భార్యాభర్తలు ఇద్దరం పంటి బాధతో ఇబ్బంది పడుతున్నాం. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే ఎక్కువ ఖర్చు అవుతుంది. ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే డాక్టర్ లేరని చెపుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డాక్టర్‌ను నియమించాలి.

– నాయిని ప్రమీల, మాచినేనిపేట

వైద్యసేవలు అందిస్తాం..


త్వరలో దంత వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. జూలూరుపాడు పీహెచ్‌సీలో పని చేసే రెగ్యులర్ డెంటల్ డాక్టర్ డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఈ సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. మరో డాక్టర్ వస్తారు.

– డాక్టర్ బి.వెంకటేశ్వర్లు, మెడికల్ ఆఫీసర్, జూలూరుపాడు పీహెచ్‌సీ

కొనుగోలు కేంద్రం ప్రారంభం


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి: మండల కేంద్రం చుంచుపల్లిలో బుధవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరరావు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మాట్లాడతూ.. కొనుగోలు కేంద్రాల్లో సన్నరకం ధాన్యాన్ని అమ్మిన రైతులకు ప్రభుత్వం బోనస్ అందజేయటంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. ఏడాదిగా కాంగ్రెస్ ప్రభుత్వం బాగా పనిచేస్తోందని, ఆరు గ్యారెంటీల అమలు జరుగుతున్నాయని చెప్పారు. అనంతరం సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు మాట్లాడుతూ... రైతులు బోనస్ పొందాలంటే తప్పనిసరిగా ప్రభుత్వ నింబంధనలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సింహారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, వాసిరెడ్డి మురళీ, బాగం హేమంతరావు, ఎంపీడీఓ అశోక్ కుమార్, తహసీల్దార్ కృష్ణ, ఏఓ రాజేశ్వరి, సొసైటీ ఉపాధ్యక్షుడు కూచిపూడి జగన్నాథరావు, దేవీ ప్రసన్న పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల అభినందనీయం..

దశాబ్దాలుగా నిరుపేదలకు సేవలందిస్తున్న తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం విద్యానగర్‌లోని అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అసోసియేషన్ సావనీర్‌ను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... అసోసియేషన్ ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, కొల్లు నాగేశ్వరరావు, సురేష్ కుమార్, ధర్మారావు, నీరుకొండ హనుమంతరావు, సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు పాల్గొన్నారు.

అటవీ సంరక్షణ చర్యలు పటిష్టం చేయాలి...

పాల్వంచరూరల్: అటవీ సంరక్షణ చర్యలను అటవీశాఖ అధికారులు పటిష్టంగా నిర్వహించాలని, ఆర్‌ఓఎఫ్‌ఆర్ టైటిల్ హక్కు పత్రాలు కలిగిన రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి కిన్నెరసానిలో వైల్డ్‌లైఫ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.34లక్షల వ్యయంతో నిర్మించిన రేంజర్ క్వార్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం డీర్‌పార్కు వద్ద ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవంలో భాగంగా ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవంలో పాల్గొన్నారు. మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద గిరిజన కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా అటవీశాఖ అధికారి జి.కృష్ణగౌడ్, వైల్డ్ లైఫ్ డీసీఎఫ్ బి.బాబు, రేంజర్లు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలతో ప్రదర్శన..

ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాల్వంచవైల్డ్‌లైఫ్ డివిజన్ కార్యాలయం నుంచి పట్టణంతోపాటు కిన్నెరసాని వరకు వైల్డ్‌లైఫ్ ఉద్యోగులు బైక్‌లతో ప్రదర్శన నిర్వహించారు. ర్యాలీని డీసీఎఫ్ బాబు ప్రారంభించారు.

'ప్రశ్నించినందుకే కక్ష సాధింపు'

ఇల్లెందు: ఉపాధ్యాయుల హక్కుల సాధన, విధుల్లో న్యాయం చేయాలని కోరినందుకే ఎంఈఓ, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు బి.రమేష్ ఆరోపించారు. ఇల్లెందులో బుధవారం ఆయన మాట్లాడుతూ... కాంప్లెక్స్ మీటింగ్‌ల్లో ఉపాధ్యాయులను కింద కూర్చోబెట్టి హెచ్‌ఎం కుర్చీపై కూర్చుని పెత్తనం చెలాయిస్తున్నారని తెలిపారు. అంతేకాక ఇన్విజిలేషన్ విధులు, డ్యూటీలు, కులగణన ఎన్యుమరేటర్ విధులు పక్షపాతంతో కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ విషయమై ఎంఈఓ టీవీఆర్‌ఎస్.స్వామిని వివరణ కోరగా... రమేష్ ఆరోపణలు అవాస్తవమని, విద్యాశాఖకు వచ్చే నిధుల వినియోగంపై అన్ని లెక్కలు ఉంటాయని తెలిపారు. ఆయన విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్తులే ఫిర్యాదు చేశారని, తప్పులు కప్పిపుచ్చుకునేందుకు ఇలా ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

అటవీ సంపదను వృద్ధి చేయాలి


క్వార్టర్ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య, డీఎఫ్ఓ కృష్ణగౌడ్

టేకులపల్లి: టేకులపల్లి మండల కేంద్రంలోని తడికలపూడి రోడ్డులో నిర్మించిన టేకులపల్లి ఫారెస్టు రేంజర్ క్వార్టర్ భవనాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, డీఎఫ్ఓ కృష్ణగౌడ్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. ఎమ్మెల్యేని ఫారెస్టు అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఫారెస్ట్ సంపదను అభివృద్ధి చేయాలని, ఉద్యోగులందరూ విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, ఎఫ్ఆర్ఓ ముఖ్తార్ హుస్సేన్, సెక్షన్ ఆఫీసర్లు శ్రీను, పి.దేవసింగ్, ఎం.హాసిరాం, నాయకులు కోరం సురేందర్, బీట్ అధికారులు ఎస్.నగేష్, డి.రామ్మూర్తి, బి.రామ్‌సింగ్, బి.పవన్ కుమార్, ఏ.గాంధీ, బి.లక్పతి, జి.లక్ష్మణ్, బి.రవి, ఎల్.గౌరమ్మ, బి.శ్రీలత, సీనియర్ అసిస్టెంట్ అశోక్, కంప్యూటర్ ఆపరేటర్ బలరాం, బేస్ క్యాంప్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి...

ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హ్యాపీ మినరల్ వాటర్ ప్లాంట్‌ని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. నాణ్యమైన, సురక్షితమైన నీటిని ప్రజలకు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుడు కాలె అభినయ్, కోరం ఉమా సురేందర్, బానోత్ రవి, కాలే ప్రసాద్‌రావు, నర్సింగ్ లక్ష్మయ్య, ఈది గణేష్, లకావత్ లింబ్యా, మలోత్ రాందాస్, రాసమల్ల నరసయ్య, అజ్మీర శివ, మాలపోలు జయరాజు, ఉల్లోజు ఉదయ్, బొడ్డు అశోక్, లాకావత్ వీరభద్రం, కోర్ర వినోద్, నర్సింగ్ సుదీప్, కాలే నరసయ్య, అంతోటి రాకేష్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లకు బ్రేక్

సుజాతనగర్: స్థానిక దేగలమడుగు మంజీత్ కాటన్ జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు నిండినందున గురు, శుక్రవారాల్లో పత్తి అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా శని, ఆదివారం రెండు రోజుల పాటు మార్కెట్‌కు సెలవులు ఉన్నందున తిరిగి 9వ తేదీ(సోమవారం) నుంచి పత్తి కొనుగోళ్లు ఉంటాయని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

హిందువులపై దాడులను ఆపాలి

కొత్తగూడెంఅర్బన్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న ఆకృత్యాలను ఆపాలని, ఇస్కాన్ సన్యాసి చిన్మయ కృష్ణ దాసును జైలు నుంచి విడుదల చేయించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ.. సనాతన హిందూధర్మ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ రామాలయం నుంచి ఎంజీ రోడ్డు, గణేష్ టెంపుల్, పెద్ద బజార్ మీదుగా రైల్వే స్టేషన్ వరకు ప్రదర్శన, నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ధర్మ ఐక్య వేదిక, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్, భజరంగదళ్, వికాశతరంగిణి, బీజేపీ, బీసీ, బీఎంఎస్, వైశ్య మార్వాడి నాయకులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నవీన్


బానోత్ నవీన్


కంచర్ల హరీష్


పూనెం మధు

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన బానోత్ నవీన్ యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆన్‌లైన్ ఓటింగ్ ద్వారా జరిగిన ఎన్నికలో నవీన్ విజయం సాధించాడు. అదేవిధంగా గుండెపుడి గ్రామానికి చెందిన కంచర్ల హరీష్ యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు.

ఇల్లెందురూరల్: యూత్ కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడిగా పూనెం మధు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నాయకత్వం యూత్ కాంగ్రెస్ ప్రతినిధుల ఎంపిక కోసం ఆన్‌లైన్‌లో నామినేషన్లు స్వీకరించి ఆన్‌లైన్‌లోనే పోటీ నిర్వహించింది. మండల అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడగా... మండలంలోని 21పిట్ ఏరియాకు చెందిన పూనెం మధుకు అత్యధికంగా 1,543 ఓట్లు వచ్చాయి. ఈ మేరకు పార్టీ అధిష్టానం తన గెలుపును అధికారికంగా ప్రకటించిందని మధు బుధవారం వివరించారు.

సింగరేణి జీఎంకు సన్మానం


జీఎంను సన్మానిస్తున్న నాయకులు

ఇల్లెందు/టేకులపల్లి: ఇల్లెందు ఏరియా సింగరేణి జీఎంగా ఆదివాసీ అధికారి వీసం కృష్ణయ్య తొలిసారి బాధ్యతలు స్వీకరించడం సంతోషంగా ఉందని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొగ్గెల రామస్వామి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కార్యాలయంలో జీఎంను సన్మానించి మాట్లాడారు. సింగరేణి పుట్టినిల్లయిన ఇల్లెందు ఏరియా అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఇల్లెందు మండల అధ్యక్షుడు సనప కృష్ణమూర్తితో పాటు, గొగ్గెల రాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే, బీజేపీ రూరల్ అధ్యక్షుడు జర్పుల రాంచందర్ నాయక్, గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాంకుడోత్ హతీరామ్‌నాయక్ తదితరులు కూడా జీఎంను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో కోదండరాంనాయక్, చరణ్, ప్రశాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్‌ల బంద్ పాటించాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యల పరిష్కారానికి ఈనెల 7వ తేదీన ఆటో, మినీ వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్ర వ్యాపిత బంద్‌ను విజయవంతం చేయాలని తెలంగాణ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల జమలయ్య కోరారు. ఈ మేరకు స్థానిక శేషగిరి భవన్‌లో బుధవారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు ఆటో, క్యాబ్, మోటారు కార్మికులకు నెలకు రూ.12వేలను తక్షణమే అమలు చేయాలని, మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. బందను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్రి కృష్ణ, అబ్బులు, బడుగు భాస్కర్, సమ్మయ్య, జలీల్, లక్ష్మణ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందు: ఈ నెల 7న ఆటో మోటార్ క్యాబ్ బంద్ పాటించాలని బుధవారం ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో జేఏసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. జేఏసీ నేతలు యాకుబ్ షావలీ, తాళ్లూరి కృష్ణ, మద్ది మల్లేష్, చిన్నయ్య, పాయం వెంకన్న, పిల్లి మల్లేష్, యర్రయ్య, భూషణం, అశోక్, చందర్, షేక్ సలీం, వినయ్, కుమార్, సహీం, శివ, కృష్ణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు నివాళి

ఇల్లెందు: మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం కన్యకాపరమేశ్వరీ సత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్వపల్లి రాధాకృష్ణమూర్తి, ఝెలుగూరి నగేష్‌కుమార్, నరేంద్రుల అనుబాబు, రామిడిశంకర్, బోనగిరి రమేష్, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

జూలూరుపాడు: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి బుధవారం జూలూరుపాడులో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చీమకుర్తి కేశవరావు, మహంకాళి గోపాలకృష్ణ, పెండ్యాల సత్యనారాయణ, చిట్లూరి మహేష్, కొదుమూరి మల్లికార్జున్‌రావు, వందనపు సత్యనారాయణ, వేముల నాగేశ్వరరావు, ధూపకుంట్ల బుజ్జి, పెండ్యాల నగేష్, గుండా వెంకన్న, మాలోత్ మంగీలాల్ నాయక్, వేల్పుల నరసింహారావు, ధరావత్ రాంబాబు, పోతురాజు నాగరాజు, రాంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



ఇల్లెందురూరల్: మాట్లాడుతున్న ఐలయ్య

ఇల్లెందురూరల్: ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు ప్రకటించిన హామీలను అమలు చేయాలని న్యూడెమోక్రసీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, ముక్తి సత్యం డిమాండ్ చేశారు. మర్రిగూడెం గ్రామంలో బుధవారం ప్రజాసమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రసంగించారు. ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఏడో గ్యారంటీగా ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తామని చెప్పినే మరోవైపు ప్రజా సమస్యలపై పోరాడుతున్న నాయకులను అరెస్టు చేస్తున్నారని విమర్శించారు. ఇందులో భాగంగా ఎన్డీ జిల్లా కార్యదర్శి పూనెం రమేష్‌ను జైల్లో నిర్బంధించారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఏజెన్సీకి సాగునీరు అందించాలని, పోడు భూములకు పట్టాలివ్వాలని, షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జోగా కాంతారావు, పాడుగు నర్సింహారావు, కొక్కు సారంగపాణి, చింత ఉదయ్, చింత రజిత, వాంకుడోత్ సరోజిని, పూనెం కోటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం...

పాల్వంచరూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపులో భాగంగా బుధవారం స్థానిక పట్టణంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆరుగ్యారంటీల హామీలపై చార్జిషీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పొనిశెట్టి మాట్లాడారు. గంధం ప్రసాద్ గౌడ్, కటికల రంజిత్, బత్తుల వెంకటేశ్వర్లు, మాదారపు లక్ష్మణ్, మాలోతు ప్రశాంత్, దాసరి రమేష్, ధరావత్ నరేష్, మల్లెల శ్రీను, మాలోతు మురళి, శ్రీను,కిరణ్,సత్యం,అఖిల్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుడు మృతి


నివాళులర్పిస్తున్న వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ ఉద్యమకారుడు మోరె భాస్కర్ అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. సమాచారం తెలిసిన మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, దిండిగల రాజేందర్‌లు... మోరే భాస్కర్ ఇంటికి వెళ్లి ఆయన భౌతిక కాయంపై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. లాయర్స్ అసోసియేషన్ సభ్యులు, కౌన్సిలర్లు, ఉద్యమకారులు, పట్టణ ప్రముఖులు భాస్కర్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. జీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్ యాదవ్, కౌన్సిలర్ అంబుల వేణు, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ బత్తుల వీరయ్య, మాజీ ఉర్దూ కమిటీ చైర్మన్ అన్వర్ పాషా, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బొందుగల శ్రీధర్, బొమ్మిడి రమాకాంత్,అహ్మద్, మసీద్, అరుణ్, గౌస్, సురేందర్, మరియు కార్యకర్తలు, మహిళా నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు నివాళులర్పించారు. ఆయన స్వస్థలం రామవరంలో గురువారం అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సీఎం కప్ పోటీలకు సిద్ధం కండి..

ఇల్లెందురూరల్: ఈనెల 10, 11, 12 తేదీలలో నిర్వహించే మండల స్థాయి సీఎం కప్ పోటీలకు అధికారులు సిద్ధం కావాలని తహసీల్దార్ కోట రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం క్రీడా శిక్షకులు, వివిధ శాఖల అధికారులతో క్రీడల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ స్థాయిలో ఈ నెల 7, 8 తేదీలలో జట్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. దీనికోసం ప్రతి క్రీడాకారులు తమ పేర్లను ఆన్‌లైన్‌లో పేర్కొన్న వివరాలను పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికోసం పంచాయతీ అధికారులు క్రీడాకారులను చైతన్యపర్చి ఆసక్తి కలిగిన వారితో ఆన్‌లైన్ చేయించాలని వివరించారు. ఎంఈఓ స్వామి, అధికారులు, పీఈటీలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా సంబరాలు ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మాట్లాడుతూ... గ్రామస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు 10, 11, 12వ తేదీల్లో జూలూరుపాడు క్రికెట్ గ్రౌండ్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తోపాటు, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులు గ్రామ పంచాయతీ సెక్రటరీ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.